# సరికొత్త ఫాంటసీ ప్రపంచం



'బింబిసార' చిత్రంతో ఒక్కసారిగా పరిశ్రమ దృష్టిని ఆకర్షించారు యువ దర్శకుడు వశిష్ట. చరిత్ర, వర్తమానాన్ని అనుసంధానిస్తూ వినూత్న ఫాంటసీ కథాంశంతో ప్రేక్షకుల్ని మెప్పించారు. ఆయన తదుపరి చిత్రంలో చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న విషయం తెలిసిందే. కొద్ది వారాల క్రితం విడుదల చేసిన కాన్సెప్ట్ పోస్టర్ పంచభూతాల థీమ్‌తో ఆసక్తిని రేకెత్తించింది. తొలి చిత్రం తరహాలోనే సోషియో ఫాంటసీ ఇతివృత్తంతో దర్శకుడు వశిష్ట ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ఈ కథలో ఆధ్యాత్మిక అంశాలు ప్రధానంగా ఉంటాయని ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో దర్శకుడు వశిష్ట తెలిపారు. ఆయన మాట్లాడుతూ 'చిరంజీవిగారు పూర్తి స్థాయి ఫాంటసీ కథలో నటించి చాలా రోజులైంది. అందుకే ఆయన కోసం పంచభూతాలు, త్రిశూల శక్తి అనే అంశాలకు ఆధ్యాత్మికత కలబోసి అద్భుతమైన కథను సిద్ధం చేశా. ఈ సినిమాలో 70 శాతం వరకు గ్రాఫిక్స్ ఉంటాయి. ప్రేక్షకులకు ఓ సరికొత్త ఫాంటసీ ప్రపంచాన్ని పరిచయం చేస్తుంది' అన్నారు. ఈ చిత్రానికి 'విశ్వంభర' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. ఈ నెల 25 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.



శ్రీలీల

## ఇచ్చిన మాట నిలబెట్టుకుంటా

టాలీవుడ్‌లో అరంగేట్రం చేసిన రెండేళ్ల వ్యవధిలోనే అగ్ర కథానాయికల్లో ఒకరిగా ఎదిగింది అచ్చ తెలుగందం శ్రీలీల. పెద్ద హీరోల చిత్రాల్లో నాయికగా తొలుత ఈ భామ పేరునే పరిశీలిస్తున్నారంటే ఈ అమ్మడి క్రేజ్ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. శ్రీలీల ప్రస్తుతం అరడజనుకు పైగా చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. ఓ వైపు వైద్య విద్యను అభ్యసిస్తూనే మరోవైపు వెండితెరపై రాణిస్తున్నది. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కెరీర్‌పరంగా ప్రతి అమ్మాయి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని, ఒకే రంగాన్ని నమ్ముకోవద్దని సూచించింది. తన తల్లిదండ్రులకు ఇచ్చిన మాట ప్రకారం ఎంబీబీఎస్ పూర్తి చేసి వైద్య వృత్తిలో కూడా సక్సెస్ అవుతానని ధీమా వ్యక్తం చేసింది. ఆమె మాట్లాడుతూ 'డాక్టర్ కావాలన్నది నా చిన్ననాటి కల. ఆ విషయంలో నా పేరెంట్స్ కూడా ఎంతగానో ప్రోత్సహించారు. ఇక నటిగా ఇంతమంది అభిమానం సొంతం చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నా. ఏదిఏమైనా డాక్టర్ కావడం నా తొలి ప్రాధాన్యతగా నిర్ణయించుకున్నా. ఆ వృత్తిలో వచ్చే సంతృప్తి వేరు. ప్రతి అమ్మాయి తమ ప్రతిభ మేరకు అభిరుచి ఉన్న రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలి' అని చెప్పింది. ఈ భామ నటిస్తున్న తాజా చిత్రం 'ఆదికేశవ' ఈ నెల 24న విడుదలకు సిద్ధమవుతున్నది.

## అపూర్వ కలయికలో..?





సినీ రంగంలో కొన్ని కాంబినేషన్స్ ఎప్పుడు కార్యరూపం దాల్చుతాయోనని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. అలాంటి వాటిలో అగ్ర దర్శకుడు త్రివిక్రమ్, హీరో ప్రభాస్ కాంబో ఒకటి. సుదీర్ఘ కెరీర్‌లో పవన్‌కల్యాణ్, మహేష్‌బాబు, అల్లు అర్జున్, ఎన్టీఆర్ వంటి అగ్ర హీరోలతో సినిమాలు తీసి గొప్ప విజయాల్ని అందుకున్నారు దర్శకుడు త్రివిక్రమ్. అయితే ప్రభాస్‌తో ఆయన సినిమా కోసం అభిమానులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ డ్రీమ్ ప్రాజెక్ట్ తెరపైకి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. గత కొంతకాలంగా ప్రభాస్ ఎక్కువగా మాస్, యాక్షన్ సినిమాలకు ప్రాధాన్యతనిస్తున్నారు. ఆయన నుంచి చక్కటి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ వచ్చి చాలా రోజులైంది. ఈ నేపథ్యంలో ప్రభాస్ కోసం త్రివిక్రమ్ ఓ ఫ్యామిలీ కథను సిద్ధం చేస్తున్నారని తెలిసింది. అయితే ప్రస్తుతం ప్రభాస్‌కు ఉన్న కమిట్‌మెంట్స్ దృష్ట్యా ఈ సినిమా పట్టాలెక్కడానికి రెండేళ్లకుపైగా సమయం పడుతుందని అంటున్నారు. ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్, హారిక అండ్ హాసిని క్రియేషన్స్ సంయుక్తంగా తెరకెక్కించనున్నట్లు సమాచారం.






గురురాజ్, ఆర్.కె.గౌడ్, సత్యప్రకాష్

## బీఆర్‌ఎస్‌కే మా మద్దతు

గత పదేళ్లుగా సినీ రంగానికి సహాయ సహకారాలు అందిస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి, బీఆర్‌ఎస్ పార్టీకి రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో మద్దతు ప్రకటిస్తున్నామని తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఛైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'చిత్ర పరిశ్రమకు ఏ అవసరం ఉన్నా ప్రభుత్వం తరపున మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్ తక్షణమే స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. సినీ కార్మికులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్లు, దివ్యాంగులకు పింఛన్లు అందేలా సహాయం చేశారు. గత పదేళ్లుగా హైదరాబాద్‌లో శాంతి భద్రతలు అద్భుతంగా ఉన్నాయి. తెలంగాణ మరింతగా అభివృద్ధి సాధించాలంటే బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని కోరుతున్నాం' అన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు సత్యప్రకాష్, నిర్మాత గురురాజ్, దర్శకుడు బందూక్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ పయనంలో..



అంకిత ఖరత్, గెటప్ శ్రీను

జబర్దస్త్ ఫేమ్ గెటప్ శ్రీను హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'రాజు యాదవ్'. కృష్ణమాచారి దర్శకుడు. కె.ప్రశాంత్ రెడ్డి, రాజేష్ కల్లెపల్లి నిర్మాతలు. గురువారం ఈ సినిమాలోని 'రాజు యాదవ్ చూడు..' అనే తొలి గీతాన్ని యువ దర్శకుడు బాబీ విడుదల చేశారు. చంద్రబోస్ రచించిన ఈ గీతానికి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతాన్నందించారు. రామ్ మిరియాల ఆలపించారు. ప్రేమ పయనంలోని అందమైన భావాలకు అద్దం పడుతూ సాగిందీ పాట. 'ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇది. వినోదంతో పాటు హృదయానికి హత్తుకునే భావోద్వేగాలుంటాయి. టీజర్‌కు అద్భుతమైన స్పందన లభిస్తున్నది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అన్నారు. అంకిత ఖరత్, ఆనంద చక్రపాణి, రాకెట్ రాఘవ, మిర్చి హేమంత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సాయిరామ్ ఉదయ్, రచన-దర్శకత్వం: కృష్ణమాచారి.కె

## ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



వీజే సన్నీ, హ్రితిక శ్రీనివాస్ జంటగా నటిస్తున్న చిత్రం 'సౌండ్ పార్టీ'. సంజయ్ శేరి దర్శకుడు. ఫుల్ మీడియా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్నది. ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'సకుటుంబ కథా చిత్రమిది. ఇటీవల విడుదలైన టీజర్, పాటలకు మంచి స్పందన లభిస్తున్నది. ప్రస్తుతం ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్‌కు ఆదరణ బాగుంది. అదే కోవలో ప్రేక్షకులను మెప్పించే చిత్రమిది' అన్నారు. కుటుంబ అనుబంధాలు, వినోదం ప్రధానంగా అన్ని వర్గాలను ఆకట్టుకుంటుందని చిత్ర సమర్పకుడు జయశంకర్ తెలిపారు. శివన్నారాయణ, అలీ, సప్తగిరి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: శ్రీనివాస్ రెడ్డి, సంగీతం: మోహిత్ రెహమానిక్, నిర్మాతలు: రవి పోలిశెట్టి, మహేంద్ర గజేంద్ర, శ్రీశ్యామ్ గజేంద్ర, రచన-దర్శకత్వం: సంజయ్‌శేరి.







